క్లుప్తంగా

ఘనంగా రథసప్తమి



వినుకొండ టౌన్: రథసప్తమి సందర్భంగా పట్టణంలోని శ్రీనివాస నగర్‌లోని శ్రీ అలివేలు మంగా, పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక పూజలు, స్వామివారి ఉత్సవ విగ్రహాలతో గుడి ప్రదక్షిణ, ఊరేగింపు అత్యంత వైభవంగా నిర్వహించారు. పోలేరమ్మ భక్త బృందంచే కోలాటం, భజన సంకీర్తనలను ఆలయ మాడవీధులలో ప్రదర్శించారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసుల శ్రావణ్ కుమార్, ఆలయ అధ్యక్షులు రెడ్డి బంగారయ్య, సెక్రటరి అచ్యుత కృష్ణ, సుబ్బారావు, ట్రెజరర్ కాళ్ల రామకోటేశ్వరరావు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పంచలోహ విగ్రహాలకు గ్రామోత్సవం



నాదెండ్ల: గణపవరం–కావూరు డొంక రోడ్డులో కొలువైయున్న శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానం వార్షికోత్సవాలు ఫిబ్రవరి 8న జరగనున్న నేపథ్యంలో శనివారం ఉత్సవ పంచలోహ విగ్రహాలకు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. గతేడాది రూ.40 లక్షల వ్యయంతో పూర్తి రాతితో ఆలయాన్ని నిర్మించారు. వార్షికోత్సవ సందర్భంగా 86 కేజీల వీరాంజనేయస్వామి, సువర్చలా దేవి పంచలోహ విగ్రహాలను తిరుమల తిరుపతి దేవస్థానం భాగస్వామ్యంతో శని వారం ప్రత్యేక వాహనంలో ఆలయానికి చేరుకున్నాయి. శనివారం ఉదయం ఆలయ పూజారి మణికంఠాచారి బృందం ఆధ్వర్యంలో గ్రామోత్సవం నిర్వహించి అభిషేకాలు, పూజలు చేశారు. ఆలయం సమీపంలో త్వరలో వీరాంజనేయస్వామి కల్యాణ మండపం నిర్మించనున్నారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్ష కార్యదర్శులు కాట్రు శ్రీనివాసరావు, ఆదిపూడి మల్లిఖార్జునరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా భవనారుషి స్వామి వారి కల్యాణం



చిలకలూరిపేటటౌన్: పట్టణంలోని భావనా రుషి నగర్‌లో వేంచేసి ఉన్న శ్రీ భద్రావతి సమేత భావనా రుషిస్వామి వారి కల్యాణ మహోత్సవం శనివారం నిర్వహించారు. ఉదయం 10 గంటలకు అశ్వని నక్షత్ర యుక్త మేషలగ్న పుష్కరాంశమున కళ్యాణం నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు ముగ్గుల పోటీలు, ఆటల పోటీలు నిర్వహించారు. ఆదివారం సాయంత్రం స్వామి వారి ఊరేగింపు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సోమవారం రాత్రి సమారాధన విందు ఉంటుందన్నారు.

ఘనంగా రహదారి వారోత్సవాలు

శావల్యాపురం: మండల కేంద్రంలో 34 జాతీయ రహదారి వారోత్సవాల్లో భాగంగా ఆటో డ్రైవర్లు, వ్యాపారస్తులకు అవగాహన సదస్సుతో పాటు ర్యాలీ కార్యక్రమం శనివారం నిర్వహించినట్లు ఎస్సై గల్లా రవికృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఏకాగ్రతతో పని చేస్తే విజయం సొంతం

సత్తెనపల్లి: ఏకాగ్రతతో ఏ పని చేసిన యువత విజయం సాధించవచ్చని అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బగ్గి నరసింహారావు అన్నారు. పట్టణంలోని వేద ఆడిటోరియంలో నెహ్రూ యువ కేంద్రం వారి సౌజన్యంతో జన చైతన్య సమితి ఆధ్వర్యంలో యూత్ లీడర్ షిప్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ యువతకు శనివారం రెండవ రోజు జరిగిన శిక్షణలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఏపీపీ నరసింహారావు మాట్లాడుతూ యువత దేశభక్తిని పెంపొందించుకోవాలని, ఆ సమయంలో నేర్చుకున్నది భవిష్యత్తు లోనూ వారికి ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. యువతకు స్వామి వివేకానంద ఆదర్శనీయుడన్నారు. ఈ సందర్భంగా యోగాపై లక్ష్మీ యువతకు శిక్షణ ఇచ్చారు. కళాశాల అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ చింతాడ సూర్య ప్రకాష్, న్యాయవాది పిట్టల సురేష్ బాబు, యోగా ప్రొఫెసర్ కొటికలపూడి లక్ష్మి, జన చైతన్య సమితి కోఆర్డినేటర్ వెలితోటి అనిల్ కుమార్, కార్యదర్శి అన్నవరపు స్టాలిన్ బాబు, విజయకాంతి రాజు పాల్గొన్నారు.

ఇచ్చిన ప్రతి హామీ ప్రభుత్వం నెరవేర్చింది

- ప్రజలకు పారదర్శకంగా సంక్షేమ పథకాలు
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని



ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ప్రభుత్వం తమదేనని సగర్వంగా చెప్పగలమని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని పట్టణంలోని 35వార్డులో శనివారం నిర్వహించారు. మంత్రి ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న తీరు వివరిస్తూ, ఏ ఇంటికి ఏ పథకం ద్వారా లబ్ధి చేకూరిందో వివరిస్తూ, స్థానికుల సమస్యలు సైతం వింటూ వాటికి పరిష్కారాలను సంబంధిత అధికారులకు తెలుపుతూ కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ పథకాలను కులం, ప్రాంతం, మతం, రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలందరికీ అందజేస్తున్నదని వివరించారు. సామాజిక తనిఖీల ద్వారా లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేసి వారికి ఆయా పథకాలను అందజేస్తున్నదని వివరించారు. రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ఏపీకి మాత్రమే దక్కుతుందన్నారు. ప్రజల కష్టాలు తెలిసిన నేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండటం రాష్ట్ర ప్రజలు చేసుకున్న అదృష్టమని పేర్కొన్నారు. వార్డు, గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా అవినీతికి ఆస్కారం లేని విధంగా పథకాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రజల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించటమే లక్ష్యంగా గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు వివరించారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ చేస్తూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం ఎంతో భరోసా కల్పిస్తున్నదని వెల్లడించారు. మరోవైపు నాడు–నేడు వంటి కార్యక్రమాలతో ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ ఆసుపత్రులను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతూ సంక్షేమంతో పాటు అభివృద్ధికి బాటలు వేస్తున్నారని తెలిపారు. ప్రజలంతా ప్రభుత్వానికి అండగా ఉన్నారని చెప్పేందుకు కార్యక్రమానికి లభిస్తున్న స్పందనే నిదర్శనమన్నారు. ప్రభుత్వంపై ప్రజలు ఎంతో నమ్మకం, విశ్వాసంతో ఉన్నారని వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వైస్ చైర్మన్లు కొలిశెట్టి శ్రీనివాసరావు, వలేటి వెంకటేశ్వరరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, వార్డు కౌన్సిలర్ కేతావతు రమణిబాయి, 34 వార్డు కౌన్సిలర్ వడితే కోట్యానాయక్, వైఎస్సార్ సీపీ నాయకులు రంగా నాయక్, కోటేశ్వరనాయక్, బి.నాగులునాయక్, పి.హనుమానాయక్, కె.దుర్గాప్రసాద్ నాయక్, ఆర్.గోపినాయక్, ఎం.బ్రహ్మం నాయక్, ఎన్.బాబ్లానాయక్, బి.రాము నాయక్ పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు

ఎంపీపీ మూరబోయిన సుబ్బాయమ్మ

నరసరావుపేట రూరల్: ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ మూరబోయిన సుబ్బాయమ్మ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ మూరబోయిన సుబ్బాయమ్మ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో శాఖల వారీగా ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు, మండలంలో చేపట్టిన ప్రగతి పనులను అధికారులు వివరించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి సురేంద్రబాబు మాట్లాడుతూ రబీ సీజన్‌లో మండలంలో ఐదువేల ఎకరాల్లో మొక్కజొన్న, వెయ్యి ఎకరాల్లో వరి, 500 ఎకరాల్లో శనగ పంటలు సాగుచేసినట్టు తెలిపారు.

రబీ పంటల ఈ–క్రాప్ నమోదు ప్రక్రియ ప్రస్తుతం జరుగుతుందన్నారు. ఫిబ్రవరి 20వ తేదీ లోగా రైతులు సాగుచేస్తున్న పంటల వివరాలను ఈ–క్రాప్ చేసుకోవాలని సూచించారు. మందులు పిచికారీ చేసేందుకు మండలానికి మూడు డ్రోన్‌లను ప్రభుత్వం మంజూరు చేసినట్టు తెలిపారు. ఉద్యాన అధికారి నవీన్‌కుమార్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా మిర్చి అధికంగా పండిస్తున్న జిల్లా పలనాడు జిల్లా అని తెలిపారు. నల్లతామర పురుగు ప్రభావం తగ్గిందని వివరించారు. కోల్డ్‌స్టోరేజీలు, మిరపకాయల తొడాల తీసే యంత్రాలను సబ్సిడీపై ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని గ్రామాల్లోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోటప్పకొండ పీహెచ్ వైద్యుడు డాక్టర్ సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు సర్పంచ్‌లు గ్రామాల్లో విద్యుత్ సిబ్బంది అందుబాటులో ఉండటం లేదని తెలిపారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని బోరింగ్‌లకు మరమ్మతులు చేయాలని కోరారు. సమావేశంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తెలుగువారి సంస్కృతిలో భాగం ఎడ్ల పందేలు

- ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాదరావు
- పోటీలను తిలకించేందుకు వేలాదిగా రైతులు, ఔత్సాహికులు హాజరు
- ఉత్సాహభరితంగా ఏడవరోజు ఒంగోలు ఎడ్ల బలప్రదర్శన పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రకాశం జిల్లా చైర్‌పర్సన్ బాచేపల్లి వెంకాయమ్మ

నరసరావుపేట: ఎడ్లపందేలనేవి మన తెలుగువారి సంస్కృతిలో భాగమని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాదరావు పేర్కొన్నారు. సత్తెనపల్లిరోడ్డులోని డీఎస్‌ఏ స్టేడియంలో రైతు సంబరాల్లో భాగంగా గోపిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి మెమోరియల్‌పై ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఒంగోలు జాతి వృషభరాజముల బండలాగుడు బలప్రదర్శన పోటీలు శనివారంతో ఏడవ రోజుకు చేరుకున్నాయి. ఈ కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందజేసేందుకు, పోటీలకు వచ్చిన ఎడ్ల యజమానులను అభినందించేందుకు ముఖ్యఅతిథులుగా డొక్కాతో పాటు ప్రకాశం జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ బాచేపల్లి వెంకాయమ్మ, దర్శి మాజీ ఎమ్మెల్యే బూచిపూడి శివప్రసాదరెడ్డి వేర్వేరుగా హాజరయ్యారు. జూనియర్స్ విభాగంలో జరుగుతున్న ఎడ్ల పందేలను తిలకించారు. ఎడ్ల పందేలకు ఎద్దులు తీసుకొచ్చి పోటీల్లో పాల్గొన్న యజమానులకు షీల్డు, కిట్లు అందజేసి దుశ్శాలువతో సత్కరించి అభినందించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ డొక్కా మాట్లాడుతూ రైతులు పశు సంపదపై మక్కువ చూపించటం, పోటీల్లో పాల్గొనటం సంస్కృతిలో ఒక భాగమన్నారు. గత నాలుగేళ్లుగా ఇటువంటి క్రీడలు వైభవంగా నిర్వహించటం చాలా సంతోషంగా ఉందన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ తిలకించేందుకు వేలాదిమంది హాజరు కావటం చాలా సంతోషమన్నారు. ఈ సందర్భంగా 26, 27 తేదీల్లో న్యూకేటగిరీ, సబ్ జూనియర్స్ విభాగాల్లో విజేతలైన ఎడ్ల యజమానులకు నగదు బహుమతులను అందజేశారు.

ఉత్సాహ భరితంగా ఎడవరోజు ఎడ్ల పోటీలు

ఎడవ రోజు ఎడ్లపోటీలు రైతుల కేరింతలు, ఈలల మధ్య ఉత్సాహభరితంగా సాగాయి. పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా 11 జతలు పాల్గొన్నాయి. కార్యక్రమంలో పల్నాడు జిల్లా డెవలప్మెంట్ అథారిటీ చైర్‌పర్సన్ మిట్టపల్లి రమేష్, జెడ్పీటీసీ సభ్యులు పదముత్తం చిట్టిబాబు, పిల్లి ఓబుల్‌రెడ్డి, సర్పంచుల సంఘ అధ్యక్షులు వెన్నపూస నాగిరెడ్డి, ఇప్పల దానారెడ్డి, నిర్వాహక కమిటీ సభ్యులు చల్లా నారపరెడ్డి, పాలిమేర వెంకటరెడ్డి, మూరే రవీంద్ర, పొనుగోటి వెంకటరావు, కనకా పుల్లారెడ్డి, లక్కు కృష్ణారెడ్డి, వంపుగుడిజాన్, గాడిపర్తి సీతయ్య పోటీలను పర్యవేక్షించారు.

వాటర్ ట్యాంకర్‌ని ఢీకొని యువకుడి మృతి

మరో ముగ్గురికి గాయాలు



వేళంగిణిరాజు (ఫైల్)

నాదెండ్ల: నిలిపి ఉన్న వాటర్ ట్యాంకర్‌ను ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో యువకుడు తీవ్ర గాయాలపాలై ఆసుపత్రిలో మృతి చెందిన సంఘటన గణపవరం–వేలూరు డొంక రోడ్డులో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గణపవరంలో నివాసం ఉంటూ ఓ పొగాకు కంపెనీలో పనిచేస్తున్న నలుగురు యువకులు రెండు ద్విచక్రవాహనాలపై వేలూరు నుంచి గణపవరం వస్తున్నారు. ఈ క్రమంలో శివస్వాతి స్పిన్నింగ్ మిల్లు సమీపానికి వచ్చేసరికి కంపెనీ ప్రహరీ మరమ్మతుల క్యూరింగ్ పనుల కోసం వాటర్ ట్యాంకర్‌ను రోడ్డుపై నిలిపారు. రాత్రి 9.30 గంటల సమయంలో బంధనాధం వేళంగిణి రాజు (26) తన మిత్రుడు వసంతకుమార్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై బయలు దేరారు. మరో వాహనంపై వీరి మిత్రులు బత్తుల రవి, నిడమానూరు రామస్వామిలు వస్తున్నారు. ఈ క్రమంలో రాత్రి సరైన లైటింగ్ లేకపోవటంతో ఒక ద్విచక్ర వాహనం ట్యాంకర్‌ను ఢీకొనగా, మరో ద్విచక్రవాహనం సైడు కాల్వలోకి దూసుకెళ్ళింది. దీంతో ట్యాంకర్‌ను ఢీకొన్న వేళంగిణిరాజు తీవ్రగాయాలపాలు కాగా, స్థానికుల సమాచారం మేరకు 108 వాహనం చేరుకుని క్షతగాత్రులను చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్ర గాయాలపాలైన వేళంగిణిరాజు మృతి చెందగా, తీవ్ర గాయలపాలైన మరో యువకుడు బత్తుల రవిని మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. మృతుడికి భార్య, మూడు నెలల కుమారుడు ఉన్నారు. మృతుడి తల్లి మోహినిదేవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి శనివారం చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

• నవరత్నాల ముగ్గు



పట్టణంలోని 35వ వార్డులో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ కేతావతు రమణీబాయి ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ఉప్పు ముగ్గు ఎంతగానో ఆకట్టుకుంది. ఉప్పుతో చక్రాకారంలో తొమ్మిది పథకాలను ప్రదర్శిస్తూ వేసిన ముగ్గును చూసి మంత్రి విడదల రజిని స్థానికులను అభినందించారు.

–చిలకలూరిపేట

క్రీడా పరికరాలు వితరణ

శావల్యాపురం: మండలంలోని మతుకుమల్లి గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాల్లోని పూర్వ విద్యార్థి గ్రామవాసీ మతుకుమల్లి రామకృష్ణ తన వంతు సహాయంగా రూ.4 వేల విలువ చేయు క్రీడా సామగ్రి వితరణ చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్. వెంకటేశ్వరరావు శనివారం తెలిపారు. ఈకార్యక్రమంలో పీఈటి జి.అంకారావు, ఉపాధ్యాయులు శేషుగోపాలం, కాజా రాంబాబు తదితరులు ఉన్నారు.

స్కూటీపై నుంచి పడి మహిళకు గాయాలు

నాదెండ్ల: స్కూటీపై వెనుక కూర్చుని వెళ్తున్న మహిళ వాహనంపై నుంచి క్రిందపడి తీవ్రగాయాలపాలై గుంటూరు జీజీహెచ్‌కు తరలించిన సంఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం .. గణపవరం గ్రామంలో జిల్లా పరిషత్ క్వారీలో నివాసం ఉండే సామ్రాజ్యం అలియాస్ సాంబ తన మనుమరాళ్లు ఇద్దరితో కలిసి స్కూటీపై నరసరావుపేట నుంచి గణపవరం వస్తున్నారు. ఈ క్రమంలో కావూరు డొంక రోడ్డులో వచ్చేసరికి స్పీడ్ బ్రేకర్ రావటంతో వాహనం వేగానికి సామ్రాజ్యం అదుపు తప్పి రోడ్డుపై పడిపోయింది. దీంతో తీవ్రగాయాలైన ఆమెను 108 వాహనంలో చిలకలూరిపేటలోని ఆసుపత్రికి తరలించగా, మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం ఆమెకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

సింగిల్‌యూజ్ ప్లాస్టిక్‌పై దాడులు

నరసరావుపేట: పురపాలక సంఘ పరిధిలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ మీద శనివారం పలు ప్రాంతాల్లో మున్సిపల్ ఉద్యోగులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 120 మైక్రాన్స్ కన్నా తక్కువ మందం కల్గిన ప్లాస్టిక్ కవర్లపై పెనాల్టీ వేశారు. మరో మారు సదరు వ్యక్తి 120 మైక్రాన్స్ కన్నా తక్కువ ఉన్న ప్లాస్టిక్ కవర్లు విక్రయించినా, వాడినట్లయితే కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ డి.రవీంద్ర హెచ్చరించారు. వ్యాపారుల లైసెన్స్ కూడా రద్దు చేయబడుతుందన్నారు.

పారిశుద్ధ్యంపై అవగాహన సదస్సు

రొంపిచర్ల: మండలంలో అలవాల గ్రామంలో శనివారం జలజీవన్ మిషన్ ఆధ్వర్యంలో నీరు, పారిశుద్ధ్యంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో డ్వాక్రా మహిళలకు నీరు, పారిశుద్ధ్యంపై అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జలజీవన్ మిషన్ మండల కో–ఆర్డినేటర్ బాబూరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జలజీవన్ మిషన్ ద్వారా ప్రజలకు సురక్షితమైన మంచినీటిని కుళాయిల ద్వారా అందించేందుకు కృషి చేస్తుందని అన్నారు. ఈ పథకం ద్వారా 2024 కల్లా ప్రతి గ్రామంలో ప్రతి మనిషికి రోజుకు 55 లీటర్లు సురక్షితమైన నీటిని అందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అదే విధంగా సురక్షితమైన మంచినీటిని తాగి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఓలు, డ్వాక్రా మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

రాజుపాలెం: తారు రోడ్డు వేసే సమయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని పంచాయతీ రాజ్ శాఖ డీఈ సుధాకర్ కాంట్రాక్టర్ నరసింహారావుకు సూచించారు. మండలంలోని రెడ్డిగూడెం నుంచి మొక్కపాడు మీదుగా బ్యగుబండ్ల వరకు వేసిన తారు రోడ్డును శనివారం పరిశీలించారు. డీఈ సుధాకర్ సుమారు కిలో మీటర్ల రోడ్డు వేసే వరకు అక్కడే ఉండి పరిశీలించారు. తారు రోడ్డు వేసే కూలీలకు సూచనలు అందించారు. ఆయన వెంట ఏఈ సాయిరాంకిరణ్, మాజీ సర్పంచ్ పశ్యావుల కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కూలీకి గాయాలు

ఈపూరు : ట్రాక్టర్ ఢీకొట్టడంతో సిమెంటు కూలీకి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని కొచ్చర్ల సమీపంలో జరిగింది. వినుకొండలో సిమెంటు కొట్టులో కూలీగా పనిచేస్తున్న కోపెల గాలెయ్య పనులు ముగించుకొని ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తున్న సమయంలో కొచ్చర్ల సమీపంలో ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాలెయ్యకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న 108 సిబ్బంది వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతున్నాడు.

అక్రమ మట్కా కేసులో ముగ్గురి అరెస్ట్

నరసరావుపేట టౌన్: అక్రమంగా జూదం ఆడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.5400 నగదు స్వాధీనం చేసుకున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్ఐ సురేంద్రబాబు శనివారం తెలిపారు. అందిన సమాచారం మేరకు చిత్రాలయ సెంటర్‌లో దాడులు నిర్వహించి మట్కా జూదానికి పాల్పడుతున్న షేక్ మహబూబ్, సాంబశివరావు, పేరూరి వెంకటేశ్వర్లులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

టిడ్కో గృహాల్లో వెంటనే చేరాలి

మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని

చిలకలూరిపేట: టిడ్కో గృహాల లబ్ధిదారులు వారికి కేటాయించిన గృహాల్లో వెంటనే చేరాలని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని కోరారు. మున్సిపల్ కౌన్సిల్ హాలులో టిడ్కో లబ్ధిదారులు, మెప్మా సిబ్బందికి శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే టిడ్కో గృహాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తి అయిన లబ్ధిదారులు గృహప్రవేశాలు చేయాలని చెప్పారు. మెప్మా సిబ్బంది ఫోన్ చేసిన వెంటనే లబ్ధిదారులు తమ పేరున రిజిస్టర్ అయిన ఫ్లాట్‌కు సొంత తాళాలు వేసుకోవాలని తెలిపారు. ఇప్పటి వరకూ విద్యుత్ కనెక్షన్ పొందని వారి కోసం విద్యుత్ అధికారులు గృహ సముదాయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారని చెప్పారు. సబ్సిడీపై కేవలం రూ.450కు విద్యుత్ మీటర్ మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే వసతులు కల్పించటం జరిగిందని,ఇంకా లబ్ధిదారులు కోరిన పక్షంలో అదనపు సౌకర్యాలు కల్పిస్తామని వెల్లడించారు. దీని కోసం లబ్ధిదారులు ముందు గృహాల్లో చేరాల్సి ఉంటుందన్నారు. లబ్ధిదారులు కోరిన విధంగా స్కూల్ బస్సు, రవాణా సౌకర్యం వంటివి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి విడదల రజిని దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని, సంబంధిత సౌకర్యాలు కల్పించేందుకు మంత్రి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఇళ్లను ఉపయోగించని పక్షంలో అవి తిరిగి మరమ్మతులకు లోనయ్యే అవకాశం ఉంటుందన్న విషయాన్ని గుర్తించి నివాసం ఉండే ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, కమిషనర్ సీహెచ్ గోవిందరావు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి రానివ్వకండి

సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ రాణి



వైఎస్సార్‌క్రాంతిపథం ఏపీఎం భరత్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ రాణి, జెడ్పీటీసీ మస్తాన్‌రావు

నాదెండ్ల: రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో ఎక్కువమందికి పనిదినాలు కల్పించి మండలాన్ని అగ్రస్థానంలో నిలపాలని ఎంపీపీ తలతోటి రాణి చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం ఆమె అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి జెడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్‌రావు, ఎంపీడీవో జాకీర్‌హుస్సేన్, తహసీల్దార్ ఏవీ రమణ, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల కోఆప్షన్ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కోరారు. పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. ఎండుగుంపాలెం సర్పంచ్ సూరె సరస్వతి మాట్లాడుతూ తమ గ్రామంలో రెండు అంగన్‌వాడీ భవనాలు మంజూరయ్యాయని, నేటి వరకూ పనులు ప్రారంభించలేదన్నారు. ఉన్న రెండు చెరువులు కలుషితంగా ఉన్నాయని, వేసవిలో సాగర్ నీరు నింపినా తాగేందుకు పనికిరాని విధంగా నీరు మారతాయన్నారు. నాదెండ్ల ఎంపీటీసీ సభ్యురాలు అంకమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు కాట్రగడ్డ మస్తాన్‌రావు, ఎస్ఎస్‌పీ ఏఈ మురళీకృష్ణ, పంచాయతీరాజ్ ఏఈ వెంకటరామిరెడ్డి, ఎంపీడీవో జాకీర్‌హుస్సేన్ తదితరులు ప్రసంగించారు.

రీసర్వేలో ప్రతి రైతుకు న్యాయం జరగాలి

జిల్లా సర్వే ఇన్‌స్పెక్టర్ పార్థసారథి



రీసర్వే పనులపై మాట్లాడుతున్న పార్థసారథి

శావల్యాపురం: రీసర్వే పనుల్లో ప్రతి రైతుకు న్యాయం జరిగేలా రెవెన్యూ అధికారులు రికార్డులు పారదర్శకంగా తయారు చేయాలని జిల్లా సర్వే ఇన్‌స్పెక్టరు మేకపోతుల పార్థసారథి అన్నారు. శనివారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో గ్రామ సచివాలయ సర్వేయర్లు, రెవెన్యూ అధికారులతో రీసర్వే పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ 1971 ఆర్‌వోఆర్ యాక్ట్ నిబంధనలు ప్రకారం వెబ్‌ల్యాండ్‌లో నమోదు కాని భూముల కలిగిన రైతులకు సంబంధించి అగ్రిమెంటు పత్రాలు కల్గి ఉన్న వారందరు అప్పటి రిజిస్టరు విలువ ఆధారంగా తహసీల్దారు రిజిస్ట్రేషన్ చేస్తారన్నారు. 5 ఎకరాల లోపు సన్న చిన్నకారు రైతులకు ఉచితంగా నేరుగా ఆన్‌లైన్ నమోదుతో పాటు తహసీల్దారు సమక్షంలో రిజిస్టరయ్యేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. భాగస్వామ్యం పంపిణీకి సంబంధించి భూములు కూడా సరైన ఆధారాలు రెవెన్యూ అధికారులకు అందజేయాలని తద్వారా భూహక్కు పత్రాలు పొందుతారన్నారు. గతంలో సాగు చేసుకుంటు ప్రస్తుతం అనుభవంలో ఉన్నవంటి రైతులకు ఎటువంటి ఆధారాలు లేని భూములను క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారులు విచారణ చేసిన అనంతరం 15 రోజుల అభ్యంతరాలు తెలపాలని, లేని పక్షంలో సంబంధిత భూముల యాజమానికి భూహక్కు పత్రాలు పంపిణీ చేస్తామన్నారు. ఈ సదస్సులో తహసీల్దారు షేక్ జాన్ సైదులు, మండల డిప్యూటీ సర్వే తహసీల్దారు పి.నాసరయ్య, మండల డిప్యూటీ సర్వేయర్ తుంగా శ్రీనివాసరావు, గ్రామ సచివాలయ సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన ఏర్పరచుకోవాలి

ట్రాఫిక్ రూల్స్‌పై పట్టణంలో పోలీసులు, విద్యార్థుల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, విద్యార్థులు

నరసరావుపేట టౌన్: రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా ట్రాఫిక్‌పోలీస్ విభాగం ఆధ్వర్యంలో ట్రాఫిక్ రూల్స్‌పై శనివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా స్కూలు ఆవరణలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ రత్నస్వామి మాట్లాడుతూ ప్రస్తుతం ప్రతి ఒక్కరికీ సొంత వాహనం వుండటంతో ట్రాఫిక్ సమస్య పెరగిందన్నారు.

ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన లేకపోవడం వలన అనేక మంది యాక్సిడెంట్స్ గురవుతున్నారన్నారు. దీనివలన ఇతరులకు ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. ముఖ్యంగా యువత సెల్‌ఫోన్ డ్రైవింగ్, రాష్, రాంగ్ డ్రైవింగ్, ఓవర్ టేకింగ్, హెల్మెట్ లేకుండా డ్రైవ్ చేయడం ఇలా అనేక రకాలుగా వ్యక్తిగతంగా సమాజానికి ఇబ్బంది కలిగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.తిరుపతిరెడ్డి ఏజీఎం అంజయ్య, ఆర్ఐ సురేంద్ర, ట్రాఫిక్ ఏఎస్ఐలు ఆదినారాయణ, శ్రీనివాసరావు, ఉపాధ్యాయలు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందనలు



బాలికలను అభినందిస్తున్న నేతలు

శావల్యాపురం: జాతీయ స్కూల్ గేమ్స్ విభాగంలో బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో శావల్యాపురం హైస్కూలు విద్యార్థినులు (బాలికలు) అర్హత సాధించటం అభినందనీయమని వైఎస్సార్ సీపీ మండల నాయకులు ముండ్లమూరి అనిల్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల్లో ఎంపికైన విద్యార్థులతో అభినందన సభ పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాలాది శ్రీనివాసరావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. అర్హత సాధించిన బాలికలు యం.లిఖిత, ఆకుమల్ల సమీరా, వేముల దివ్యలకు రూ. 12 వేలు విలువ చేయు గ్రాఫైట్ బాట్స్‌ను ప్రోత్సాహకంగా అందజేస్తామని అనిల్‌కుమార్ సమావేశంలో వెల్లడించారు. ఈనెల 25 నుంచి 27 వరకు అన్నమయ్య జిల్లా మదనపల్లిలో జరిగిన స్కూల్ గేమ్స్ బాలికల అండర్–17 విభాగంలో రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ గేమ్ పోటీల్లో జిల్లా జట్టుకు ద్వితీయ స్థానం సాధించగా ఆ జట్టులో శావల్యాపురం హైస్కూలు బాలికలు ఎ.సమీరా, కావ్య, స్రవంతి, ఉన్నట్లు పాఠశాల పీడీ ఆర్.రాధాకృష్ణమూర్తి వివరించారు. ఈవిద్య సంవత్సరంలో రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో వివిధ విభాగాల్లో 20 మంది విద్యార్థులు పతకాలు సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భీమని అంకారావు, జవంగుల బాబు, గుర్రం గోవిందరాజులు, పాపసాని సురేష్, ఉపాధ్యాయులు బీవీ నాగేశ్వరరావు, ఆదాంఖాన్ పాల్గొన్నారు.